గాపయనాయకుడు రాయబారమంపెను. మహమ్మదు షా యేమిసేయగలడు ? అప్పటి దుర్బల స్థితియందు దతనికి యుద్ధము తలపెట్టరాని విషయము. అమీరులా విశ్వాసపాత్రులుగారు; బలమా చాలదు; ధనమా లేదు. మీదుమిక్కిలి ఢిల్లీ పాదుషా పైత్తివచ్చునను భయము. ఈ స్థితి యందు విజయనగర తెలింగాణ ప్రభువు లేకమై కయ్యమునకు గాలుద్రవ్విన వారి నతడెట్లెదుర్కొనగలడు ? కాని యప్పటి స్థితిగతు లట్లె నిలుకడగ నుండజాలవు. ఖలీఫాకడకు బోయిన తన తల్లి కార్యమును సాధించుకొని వచ్చిన హిందూరాజులను దగినశాస్తి చేయవచ్చును. కావున తనతల్లి తిరిగివచ్చునంతవఱకు కాలము గడపిన నటువెనుక సర్వకార్యములును సానుకూలపడవచ్చును. అని చింతించి మహమ్మదు షాహు కాలహరణము సేయ నిశ్చయించి, విజయనగర తెలింగాణ రాయబారులను సత్కరించి లాలించి తేలించి ప్రతిసందేశమును జెప్పి వీడుకోలిచ్చి పంపక పదునెనిమిది మాసములు గడపెను.

అంతట మహమ్మదుషాహు తల్లి తిరిగి వచ్చినది మక్కానుండి. తాను కోరినట్లె ఖలీఫా ఢిల్లీ సుల్తానుకు ఫర్మానా వ్రాసి యంపెనని తెలియవచ్చెను. ఫీరూజుశాహు తుఘ్లాకు మతమునందు గాఢాభిమానముగల ప్రభువు. ఖలీఫా యాజ్ఞను జవదాటక యాచరణకు దేగలడనుటకు సంశయములేదు. కావున రాజకార్యముల నిచ్చవచ్చినట్లు జరుపుటకు జంకబనిలేదు. మొట్టమొదట తనయెడ విముఖులైన యమీరులను శిక్షించెను. పిమ్మట విజయనగర తెలింగాణ రాయబారులను రప్పించి కోపోద్రేకముతో వారి నేలిన ప్రభువులు దనకు జెల్లింపవలసిన కప్పమును ఖజానాకు జమకట్టక నింతకాల మాలస్య మేలచేసిరో తెలుపవలసినదని తీవ్రముగ మందలించెను. రాయబారులంతట భయభ్రాంతచిత్తులై తమ సంస్థానములకు మరలి చని తమ ప్రభువుల కా విషయములను నివేదించిరి. అందుమీదట బుక్కరాయలును గాపయనాయకుడును బహమనీ సుల్తానుపై యుద్ధము ప్రకటించిరి. తూర్పున గాపయనాయకుని సైన్యములు వచ్చి పూర్వము అల్లావుద్దీన్ హసన్‌గంగూ తెలింగాణమునుండి జయించి కైవసము జేసికొనియుండిన కౌలాసు మొదలగు స్థలములను స్వాధీనపఱచుకొనెను. అట్లే దక్షిణము నుండి విజయనగర సైన్యములు వచ్చి కృష్ణాతుంగభద్రల మధ్యసీమల నాక్రమించుకొనెను. ఇట్లు విజయనగర బహమనీ రాజ్యములకు యుద్ధము పొసగినది. (సశేషము)

# అద్దెయిళ్ల ఉపాఖ్యానం

'సాగర్'

'ఇల్లు కుదిరింది మాకు' ... 'ఎక్కడా ?'... 'ఎక్స్టెన్షనులో' ... 'చాలా దూరమే!' ...'ఏం చేస్తాం, వూరంతా గాలించినా ఆ మాత్రం కొంప దొరకందే!...' అతి ప్రయాస మీద యిల్లు దొరికింది. సంతోషకరమైన ఈ విషయాన్ని, మా పినతల్లి కూతురు పార్వతితో చెబుతున్నా, అప్పట్లో అంతకంటె అప్పులెవ్వరూ అక్కడ లేకపోవటం మూలాన్ని.

కుదిరిన యిల్లు చూట్టానికి పార్వతీ, నేనూ బయలు దేరాము, చూపించిన ఏజెంటును వెంట బెట్టుకుని, జట్కాలో.

మెయిన్ రోడ్డు వెంబడి ఎక్స్టెన్షన్ దాకా వెళ్లి, అక్కడ కొన్ని మలుపులు తిరిగింది మా జట్కా. అన్నీ చక్కటి బంగాళాలు, కొత్తగా కట్టినవి. మంచి గాలి అదీ వుంటుందని సంతోషించాను.

జట్కా ఆగింది. క్రీమ్ కలరు వేసిన ప్రహారీ గోడ, లోపల ఆ దేరంగు వేసిన డాబా. వార్నిష్ పూసిన తలుపులు, వాట్లకున్న

అందమైన నికెల్ గడియలు మమ్మల్ని లోపలికి ఆహ్వానించాయి. ఒక ముసలావిడ మాకు యిల్లూ, దొడ్డీ అవీ చూపించింది. వాట్లల్లో ఎక్కడ ఎలా మసులుకోవాలో పాఠం చెప్పింది. అన్నిటికీ 'సరే' అన్నాము.

పార్వతికి కూడా యిల్లు నచ్చినట్లే వుంది. బట్టా ఎక్కుతూ, 'ఆలస్యమైనప్పటికీ, మంచి యిల్లు దొరికింది, దూరమయినా సహించవచ్చు!' అంది.

మేం మా యింట్లో ప్రవేశించిన కొద్ది రోజుల్లోనే పార్వతి, భర్తకు ట్రాన్స్ఫరు కావటం మూలాన్ని, మరో వూరు వెళ్ళిపోయింది.

వెడుతూ వెడుతూ మాకు హితవుకూడా చెప్పిపోయింది: మంచి యిల్లు దొరికింది, అనవసరంగా గొడవలు పడకండి, యింటి వాళ్లు ఏమైనా అన్నా మనము తగ్గివుండటం మంచిది ...యేమేవో!

ఒక రోజున పార్వతి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది: మంచి యిల్లు దొరకలేదు! దొరికినది పెద్దదే అయినా చీకటి గుయ్యారం, దోమల పుట్ట, పొగలే లైట్లు వేసుకోవాలి! పంపు వుంది దొడ్లో...ఎక్కడికక్కడికే నయం...యింకా యింకా!

రోజులు దొర్లిపోతున్నాయి. మళ్లీ పార్వతి దగ్గిరనుంచి వుత్తరం: యింటావిడ పిల్లల కోడి; చాపల మార్కెట్టులో లాగ పిల్లలు చివరగా, గోల చేస్తూ వుంటారు. పొరపాటున రోడ్డు వెంబడి కారు వెడితే చాలు, దుమ్మంతా యింట్లోనే వుంటుంది...వగయిరా, వగయిరా.

ఇటునుంచి మేమూ రాశాము: ఇంటి వాళ్లు ఒంటెత్తువాళ్లు, మహాగర్వం. అప్పు పుచ్చుకోవడమేగాని తిరిగి యివ్వడమంటూ వుండదు, కాయగూరలూ అవీ చేసుకుంటే ఓర్వలేరు! వాళ్ల బొంగురు గొంతుకలకు సాయం, పాట లొకటి, తలకాయలు పగిలేలా... యేమేవో.

ఒక వుత్తరంలో పార్వతి అంటుంది: వాళ్ళ ఆయనకు గోడలకు క్యాలెండరులూ, సినీమా బొమ్మలూ మొదలయినవి తగిలించడమంటే సరదా. అందుకని లోలోను డబ్బు తగలేసి రకరకాలయినవి కొని పట్టుకవచ్చి గోడలకు తగిలించాడట. పొరపాటున యింటావిడ వాట్లను చూచింది... దాంతో ఆమె, 'షాపులోలాగ ఏమిటమ్మా పాడు బొమ్మలివి- సంసారుల కొంపల్లో', అని చీదరించుకుని, గోడలనిండా మేకులు కొట్టేశారని కారాలూ మిరియాలూ నూరి, పెద్ద రాద్ధాంతంచేసి చక్కా పోయిందిట.

పార్వతిని ఓదార్చడానికి మేము రాశాము: నయం! మాయింటి ముసలమ్మ, యింట్లో పిండి దంపుకుంటే, డాబా వూడి పడిపోతుందని గోల. అట్ట చెక్కల్లావున్న తలుపులు (అదీ మా కర్మే) కొంచెం కొట్టుకుంటే పెద్ద శబ్దం చేస్తాయి. దాంతో పెద్ద గోల - యిదీ వరస.

చూస్తూంటే వానాకాలం వచ్చేసింది. పార్వతి రాస్తుంది కదా: వానంటే భయం పట్టుకుంది, యిల్లంతా కురవటమే! రాత్రిళ్లు వస్తే యింక శివరాత్రి జాగారమే!

మా అనుభవం రాశాము: మీకు వాన వున్నప్పుడే బాధ - మా సంగతిచూడు, పైన డాబా సరిగా గిలాబా చేయకపోవటంచాత నీరు నిలవుండి, వాన వెలిశాక దూలాల్లోంచి లోపలికి దిగి తర్వాత రెండుమూడు రోజులదాకా మా మీద పన్నీరువర్షం. చూచుకో మా అదృష్టం!

ఇంటి సౌఖ్యం విషయంలో ఒకరికి ఒకరం తీసిపోలేదని, వుత్తరాలద్వారా తెలుసుకున్నాము. ఒకరినొకరం సముదాయించుకున్నాము.

ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటేమాత్రం రోజు వస్తే తప్పుతుందా!

ఒకరోజున 'పిల్లిని ఎలక పట్టుకుంది'. అదిగో, యిదిగో అంటూ ముసలమ్మ లేనిపోని తగాదా లేవదీసింది. పెద్ద రగడ అయింది ఆవేళ. దాని పర్యవసానమేమంటే-ఆ మధ్యాహ్నమే మేము చిన్నదయినా, యిరుకయినా, ప్రహరీ లేకపోయినా, హంగులు సున్నా అయినా, ఏమీ ఆలోచించకండా మరొక యింట్లో ప్రవేశించాము.

మూడో రోజుకే పార్వతి దగ్గిరనుంచి వుత్తరం వచ్చింది. ఇంటివారబ్బాయికీ, వాళ్ళ రాముడికీ మధ్య తగాదా వచ్చింది. రాముడు వాడిని చితకబాదాడు. పెద్దలు అనవసరంగా రొంపి చేసుకుని తగాదాపడ్డారు, పర్యవసానం వాళ్లు యిల్లు ఖాళీ చేసేశారు!